మహేంద్ర　　　　　　　　　　　　　　　　　　　　　　　పెద్ద కథ

కనిపించని కోయిల

(గత సంచిక తరువాయి)

రవి తలుపు వెనుకగా చెప్పులు వదలి కాళ్ళు కడుక్కోడానికి పెరట్లోకి బోతున్నవాడు—హాల్లో తనహోల్డాలు విప్పబడి—బట్టలు, పుస్తకాలు, షేవింగ్ సెట్టు చిందర వందరగా పడివుండడాన్ని చూశాడు. తాను మూడు సంవత్సరాలుగా అతి జాగ్రత్తగా చూసుకున్న పుస్తకాలు, పై తరగతులకు వెళ్ళేందుకు కావలసిన అప్లికేషన్లు, ప్రాస్‌పెక్టస్—ఇలా కేర్‌లెస్‌గా పారవేసి వుండడంతో రవికి తీవ్రమయిన కోపం వచ్చింది.

"అమలా, ఎవరే నా బుక్స్ ఇలా చిందర వందర జేసారు." గట్టిగా కేకేశాడు రవి.

"నాకేం తెలియదన్నా! నేనసలు ఇంట్లోకి రాందే" బిక్క మొగం వేసింది అమల.

పూజగదిలో పెట్టడానికి ప్రమిద తీసుకెళుతున్న జానకమ్మ, జరుగుతున్న హంగామాను జూచి "రాజా తీసినట్టున్నాడు చూడరా" అంది.

ఇల్లంతా వెదికినా రాజా జాడలేదు. విసుగు కప్పి పుచ్చుకుంటూ వంటిట్లో కెళ్ళాడు రవి మంచినీళ్ళు తాగి రావడానికి. వంట గదిలో ఒక మూల నీళ్ళబిందె ప్రక్కగా కూచొని, ఏదో పుస్తకంలోకి తదేక దీక్షగా చూస్తున్నాడు రాజా. తాను రావడంతోటే ఉలిక్కిపడి లేస్తూ, ఇంతకూ ఏమీ జరగనట్టు "ఎప్పుడొచ్చినావన్నా" అంటూ మర్యాద ప్రదర్శిస్తున్న తమ్ముడ్ని చూచి ఏం జెప్పాలో తోచక నవ్వేశాడు రవి.

"ఉదయం వచ్చినామండీ! మీ దర్శనం మాత్రం ఇప్పటి కయింది. మన రాజ్యమంతా సుఖంగా వుందా?" అంటూ ఎగతాళి జేసాడు.

"జామతోటలో కోతులు పడ్డాయన్నా. ఇంతవరకు అక్కడే వుండి తరిమివస్తున్నా" అన్నాడు రాజా.

"మీకంటే కోతులే నయం. రాళ్ళకన్నా బెదరతాయి. అసలు మిమ్మల్నెవరు తోటకెళ్ళమంది ? తోట కాపుదలకు సల్లాపురి ఉన్నాడుగా" హాల్లోంచి మందలించాడు రామనాథం.

"సల్లాపురికి ఈరోజు జొరమొచ్చింది. అదీగాక పండ్లన్నీ ఇంకా పచ్చివే. పచ్చికాయ లెవరు తింటారు." తండ్రి అడిగిందేమో పిచ్చి ప్రశ్నయినట్టు తేల్చేశాడు రాజా.

"అవునవును. మరి నా పుస్తకాలకేం జ్వరమొచ్చింది. అన్నిటకీ మందులిచ్చి ఇల్లంతా పడుకోబెట్టేశావు." రవి నవ్వుతూనే రెట్టించాడు.

"అసలు నేను కూడా వద్దన్నాను. శ్యామలే, తెరవమని ఒకే గోల పెట్టింది" అన్నాడు రాజా.

"శ్యామలకు నా హోల్డాలుతో ఏం పనిరా బాబూ? అసలు ఈ రోజంతా ఆ పిల్ల మనిల్లు వదిలినట్టు లేదు. మామయ్యావాళ్ళు మరీ రాబం చేస్తున్నట్టుంది" విసుక్కున్నాడు రవి.

"వాళ్ళ మామయ్య వాళ్ళింటికి అది రావడానికి మధ్య నీ అనుమతి ఎందుకురా? అయినా నువ్వు వస్తావని ఉత్తరం రాసిం దగ్గర్నుంచి రోజా బావెప్పుడొస్తాడని ఒకటే పాట పాడుతోంది. ఈ రోజు నీ పుస్తకాలను తాకిందని తెగ నీల్గుతున్నావు" మేన కోడల్ని వేనకేసు కొచ్చింది జానకమ్మ.

కథ ఇంకేమలుపు తిరగబోతుందోనన్న భయంతో రవి పుస్తకాలు సర్దుకోడానికి హాల్లోకి నడిచాడు. పుస్తకాలను అలమారులో సర్దుతున్నంతసేపూ, సూట్‌కేస్ తీసి బట్టలను బీరువాలో పెడుతున్నంతసేపూ, రాజా అన్నచర్యల్ని నిశితంగా గమనిస్తూనే వున్నాడు. షేవింగ్ సెట్‌లోని కత్తెర దగ్గర్నుంచి, బాల్‌పాయింట్ పెన్ను, కీచైను, టేబిల్ లైటు వరకు వాడిదృష్టిని తప్పించుకున్న వస్తువు ఒకటీ లేదు. అందులో ఒక్కొక్కదాన్ని గురించే వాడు వేయి అనుమానాలు పడగలడని, వేయి ప్రశ్నలు వేయగలడని రవికన్పించింది.

"రాజా, అన్నను విసిగించక ఇలా వచ్చి చదువుకో" అని తండ్రి పిలవడంతో ఒకటి రెండుసార్లు వెనిక్కి తిరిగి జూస్తూ అయిష్టంగానే గది బయట కడుగు బెట్టాడు రాజా.

రాత్రి భోజనాలయ్యాక అలవాటుగా నిద్ర రాకపోవడంతో, టేబిల్ లైటు వేసుకుని ఏదోనవల చదువుకుంటూ వుండిపోయాడు రవి పదింటిదాకా.

అప్పటికి ఇంటిపని పూర్తయినట్టుంది, పడుకోవడానికెళ్తూ కొడుకు దగ్గరికొచ్చి "వసారాలో మంచమేసానునాయనా. తెల్లవారు జామున గాలెక్కువైతే మంచం గదిలో వేసుకో. తాళం దిండుకింద బెట్టాను. వాచీని పెద్దింట్లో గూట్లో బెట్టిపోవడం మర్చిపోక" అని జెప్పిబోయింది జానకమ్మ.

మరో అరగంట తర్వాత "అపరాత్రయినా నిద్రరాలేదుట్రా చదివింది చాలు పడుకో" అంటూ కసిరాడు రామనాథం హాల్లోంచి

పూజగదిలోని గూట్లో వాచీని తీసి బెడుతూ వెనుదిరిగిన రవికి నాయనమ్మ ఫోటో కన్పించింది. దానికి వేసిన పూలమాలలో పూలన్నీ వాడిపోగా కొంచెంగా వూగుతోంది. నిరుడు చలికాలంలోనే ఆమె వారం పదిరోజులు కాయిలాపడి కాలం చేసింది.

వసారాలో కొచ్చి మంచంమీద వెల్లికిలా పడుకున్నాడు రవి. నల్లటిఆకాశంలో నక్షత్రాలు మాత్రం నిర్లిప్తంగా వెలుగుతున్నాయి. ఎక్కడో వీధి చివర కుక్కలు కూడా మొరుగుతున్నాయి. గాలిలో పెట్టిన పుస్తకం పేజీల్లా రవి ఆలోచనలు రెపరెపకొట్టుకున్నాయి. పందిరి నుంచి వస్తున్న మల్లెపూల వాసనలు పీలుస్తుంటే తానింకా ఏడేండ్ల కుర్రవాడేమోనన్న భ్రాంతి కల్గుతోంది. రాత్రిళ్ళు నాయనమ్మ పాడే 'ఊర్మిళాదేవి నిద్ర' ఇంకా విన్పిస్తున్నట్టే వుందతనికి.

తను పుట్టకముందు ఈ ప్రపంచం ఎన్నాళ్ళుగా జరుగుతోందోగాని తనకదంతా ఒక దీర్ఘ రాత్రిగానే అన్పిస్తుంది. పుట్టి భూమ్మీద పడ్డాక తన శైశవ జీవితమంతా మసక మసకగా అంతా ఒక సుషుప్తిలాగే జ్ఞాపకం ఉంది తనకి. తెలిసీ తెలియని బాల్యం ఒక క్రీడలా గడచిపోయింది. కాగా గడచిన అయిదేళ్ళ కాలేజీ జీవితం కేవలం ఒక కలగా పరిణమించింది.

కని, పదిహేనేండ్లు పెంచిన వారిని చూడకుండా తాను దాదాపు అయిదేండ్లు బ్రతుకగలిగాడు. అయిదేండ్లు తనతో గడిపిన ప్రాణమిత్రుల్నందరిని వదలి మళ్ళీ యిక్కడికి వచ్చేయగలిగాడు. వీటన్నింటినీ తాను భరించగల్గినా, తన జన్మకు కారణభూతుడయిన తండ్రి, కన్నతల్లి, తన బాగోగులనుగురించి గత పందొమ్మిదేండ్లుగా తపించిన నాయనమ్మ గూడ కేవలం ఒక జ్ఞాపకంగా మిగిలిపోవడం భరించలేని విషయంగా తోచిందతనికి. నడిజాము తర్వాత ఎప్పుడో వెళ్ళే ఎక్స్‌ప్రెస్ కూత కూడ విన్న రవి చివరికెప్పుడో రెండింటికి పయిన నిద్రలోకి పడగలిగాడు.

*　　　*　　　*

ఉదయం ఏడింటికి కాఫీ త్రాగి, తల్లితో జెప్పి మామిడి తోటవైపు బయల్దేరాడు రవి. దారిలో రమేషు, శ్రీధర్ కన్పించారు. నిజానికి అందరిది ఒకే యీడైనా పల్లెపట్టున వుండడంతో ఇద్దరూ మొరటుదేలి రవికంటె కొంచెంపెద్దవారుగా కన్పించవచ్చు. ఇద్దరికీ ఎస్సెస్సీలో అత్తెసరు మార్కులు రావడంతో చదువు మానేశారు. శ్రీధర్ రవిమామయ్య కొడుకు. ఐతేవారి మధ్య బాంధవ్యంకంటె స్నేహమే హెచ్చు. రవిమామయ్య రాజరత్నంకు రైస్‌మిల్లులో షేరుంది. రామాపురం చక్కెర మిల్లులో గూడ షేరు వేసినట్టు ఊరివాళ్ళు అనుకుంటున్నారు. శ్యామలకు పెళ్ళయితే రాజరత్నం పుట్టినదాదిగా పెంపొందిస్తున్న ఆస్తికంతా ఏకైక వారసుడు శ్రీధర్. ఐతే శ్రీధర్ ఊర్లో కొందరు పనీపాటాలేని వెధవల్తో చేరి చెడిపోతున్నాడని రాజరత్నం ఈమధ్య కన్పించిన ప్రతివాడికీ చెబుతున్నాడట.

రమేష్ రవితో ఈ సంగతులు చెబుతున్నంతసేపు అదేమో తన కర్థం కానవసరంలేని వేదాంత ప్రసంగమన్నట్టుగా చిద్విలాసంగా దిక్కులు జూస్తున్నాడు శ్రీధర్. ఉన్నట్టుండి జ్ఞాపకం వచ్చిన వాడిలా పట్టణంలో రవి చూసే సినిమాలను గురించి, సినిమా టాకీసుల్ని గురించి ప్రశ్నించడం మొదలుబెట్టాడు. ఆతరువాత జరిగిన వారి సంభాషణలో రవి తెలుసుకున్న విషయం ఏమిటంటే తనకున్న సినిమా పరిజ్ఞానం మరీ తక్కువని, అసలు తెలిసిందీ లేన భ్రమేమోనని. రవి తానుడుగుతున్న ప్రశ్నలకు వేటికీ సమాధానం ఇవ్వకపోగా, కొందరు ప్రముఖులయిన సినిమా తారలను సైతం ఎరుగుండకపోవడం హాస్యాస్పదంగా దోచింది మిత్రులిద్దరికీ. ఇన్నాళ్ళు తాను చదివిన చదువంతా వ్యర్థమయి పోయినట్టు ఏకగ్రీవంగా ఆమోదిస్తున్న స్నేహితులను జూచి రవికేంజేయాలో పాలుపోలేదు.

జాతీయ అవార్డులు వచ్చిన సినిమాలనన్నీ తాను కాలేజీలోనే చూశానని చెప్పగా, అసలు మనుషులు చేయదగ్గ ఏ పనీ తాను చేసేట్టులేనని తేల్చేశారు. అవార్డుల సినిమాలను ప్రత్యేకించి అసలు చూడగూడదని 'చంద్రబాబు' గూడ సెలవిచ్చినట్టు ఇద్దరూ పగలబడి నవ్వుకున్నారు.

తోట చేరుకునే లోపల ఎలాగైనా తన ప్రయోజకత్వం నిరూపించుకోవాలనే ధ్యాసలో పడ్డాడు రవి. దేశంలో జరుగుతున్న రాజకీయ పరిణామాల ప్రసక్తిదెస్తూ ఇప్పుడిప్పుడే ప్రజల్లో చైతన్యం కల్గుతోందనీ, కనీసం జనతా పాలనలో ఐనా పల్లెలు బాగుపడవచ్చని అభిప్రాయపడ్డాడు రవి.

ఐతే ఏ పార్టీ అయినా ఒకటేనని, దేశం బాగుపడాలంటే చంద్రబాబు చెప్పినట్టు సమర్‌గుహలో నివసిస్తున్న నేతాజీ ఐనా రావాలని, లేకపోతే మొన్న హరిదాసు చెప్పినట్టు పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాములవారే వీరభోగ వసంతరాయులై గుర్రమెక్కి రావాలనీ రమేష్ నిర్ణయించేశాడు. డిగ్రీలకు, పదవులకు వేనికీ ఇప్పుడు విలువలేదనీ, నేడున్న పరిస్థితుల్లో పైకి రావల్సినవాడు ఎదుటివాణ్ణి అణగద్రొక్కడమే మార్గమని—ఇంకా దేశం గీశం అంటే దానికి మిలిట్రీ పాలనలో తప్ప ముక్తిలేదని చంద్రబాబు గూడ చెప్పినట్టు శ్రీధర్ తేల్చేశాడు.

ఇంతా విని వీరినింత బాగా తర్ఫీదు చేసిన చంద్రబాబు ఎవరో తెలుసుకోవాలనిపించింది రవికి. చివరి కెలాగో తెగించి "అదిసరే, ఇంతకీ చంద్రబాబెవడు? వాడి మాటే మీకు వేదవాక్కులా వుందే!" అంటూ తన బాధనంతా వెళ్ళగ్రక్కాడు.

ఈసారి రమేష్, శ్రీధర్‌లు రవికేసి చూసిన చూపుకు వ్యాఖ్యానం చెప్పడం సాహసమే అవుతుంది. రెండు రెండ్లు నాలుగని కూడ చెప్పలేని గ్రాడ్యుయేట్ ఎవడైనావుంటే, ఆ కాలేజీ ప్రిన్సిపాల్ అతడిని అలా చూచి వుండవచ్చునన్నది యిక్కడ దాదాపు సరిపడే ఉపమానం.

"చంద్రబాబు తెలియదటోయ్? మద్రాసులో యింటర్‌మీడియట్ చదివాడట. కాలేజీలో ఏదో ఎలక్షన్లలోబడి—అక్కడ జరుగుతున్న అన్యాయాలను సహించలేక రిజైన్‌చేసి మరీ వచ్చేశాడట! ఆ మాటకొస్తే ఎవర్నైనా లెఖ్ఖచేసే తరహాకాదు. ఇంతకూ ఈ చంద్రబాబు ఎవడనుకుంటున్నావు? మన స్టేషను మాస్టరు భార్యకు స్వయానా తమ్ముడే."

ఎలాగైనా సాయంత్రం లోపల చంద్రబాబు దర్శనం చేయించగలమని హామీ యిస్తూ మిత్రులిద్దరూ చెంగల్రాయులు టీ హోటల్లోకి దూరారు. చెంగల్రాయులు తన్ను పిలుస్తున్నా మళ్ళీ వస్తానని సర్ది చెబుతూ రవి తోటకేసి నడిచాడు.

వాగులో నీళ్ళు పాదాలు మాత్రం తడిచేటట్టుగా పారుతున్నాయి. దూరంగా బ్రిడ్జిపయిన తెల్లవారి రైలు పోతున్న చప్పుడు. తోటకీ వాగుకీ సరిహద్దుగా కానుగచెట్ల చల్లటి నీడ వుంది. తుఫాను గాలుల్లో సగానికి పైగా తగ్గిన కాతతో తోటంతా కుటుంబ నియంత్రణ ఆపరేషను తర్వాత లావయిన స్త్రీలా పచ్చగా కళకళలాడుతూ వుంది. లేతమామిడి ఆకులపై సూర్యుని కాంతిపడడంతో విచిత్రమయిన నూనె మెరుపుతో వనమంతా తైలవర్ణచిత్రంలా వుంది. నిర్మలంగా వున్న నీలాకాశంలో చిలకల గుంపులు ఎగురుతున్నాయి. ఏమూలనుంచో గండుకోయిల ఒకటి అదేపనిగా కూస్తున్నట్టుంది. ఏటిమీదినుంచి రివ్వురివ్వున వీస్తున్న ఈదుర గాలులలో వనమంతా ఆ పిలుపుకు ఊగిపోతున్నట్టుగా వుంది.

మొదట అప్రయత్నంగా అటూ ఇటూ చూడసాగిన రవి, క్రమంగా కోయిల పొలకువకోసం ప్రతిచెట్టూ గాలించసాగాడు. ఎంతకీ కన్పించకపోగా, వెక్కిరింపుగా తన నాటపట్టిస్తున్నట్టుగా ఏమూలనుంచో కోయిల కూత విన్పిస్తూనే వుంది. తనకు తెలియకుండానే ఏర్పడిన పట్టుదలతో రవి తోటంతా వెదికాడు.

ఇంతలో కోయిల పిలుపుకు ప్రతిగా తోటలోనుంచి ఎవరో బదులివ్వసాగరు. దాదాపొక రెండు నిముషాలసేపు ఒకరికొకరు పోటీగా ఈ సంభాషణ సాగింది.

రవి కోయిలను వెదికే ప్రయత్నం మానుకుని తోటవెలుపలికొచ్చాడు. మామిడితోట నానుకుని వున్న మిరపతోటలో టొమేటాలు కోస్తూ శ్యామల కన్పించింది.

'కోయిల గానీ కన్పించిందేం?' వెక్కిరింపుగా నవ్వసాగింది శ్యామల.

'ఆహాఁ. నా హోల్డాల్లో తమరికేవి కన్పించింది'' బదులిచ్చాడు రవి.

తడబాటు కప్పిపుచ్చుకుంటూ "నీ వస్తువులు వెతకాల్సిన అవసరమేం నాకు లేదు. ఏదో రాజా చూడమంటే ఆల్బమ్‌లోని ఫొటోలు చూశానంతే'' బెట్టుగా అంది శ్యామల.

ఇంతలో ఎవరో పిలిచినట్టుగా చేతిలో జామపళ్ళతో వచ్చాడు రాజా. మొత్తం తప్పంతా తనమీదే వేస్తున్న శ్యామలతో "అసలు మొదట చూడమంది నువ్వేగా! నువ్వెప్పుడూ ఇంతే. చేసేదంతా నువ్వేజేసి, చివరకు తప్పు నామీదకు తోసేస్తావు. ఇందాకా జామపళ్ళు తెమ్మని బ్రతిమలాడి, ఇప్పుడేమో అన్న వస్తూనే నన్ను షెడ్‌లో దాక్కోమన్నావు. ఇప్పుడు అన్న కన్పిస్తూనే నామీద చాడీలు మొదలుబెట్టావు'' అంటూ ఏడుపుముఖం పెట్టాడు.

"అస్సలిప్పుడేం జరిగిందని? మహాగొప్ప మీ పుస్తకాలు చూడకబోతే నాదేంపోయింది. ఏదో పెద్ద నేరం చేసేసినట్టు నిలదీస్తున్నారు అన్నదమ్ములిద్దరూ'' శ్యామలకైతే కళ్ళనీళ్ళ పర్యంతం అయింది.

చూసీ, చూసి రవి పక్కున నవ్వేశాడు. "ఫర్వేదులే శ్యామలా. ఇంత చిన్నదానికే చిన్నపిల్లలా ఎందుకేడుస్తావు. మీ నాన్నగారితో ఈసారి రామాపురంనుంచి ఫిల్ము తెమ్మను. మన దొడ్లో మీ ఫొటోలన్నీ తీస్తాను'' అంటూ సముదాయించాడు.

కొంచెంగా శాంతిస్తూ శ్యామల అంది. "మాకేం అక్కరలేదు. ఐనా పట్నంలో కాలేజీ పిల్లల్లా ఒకే ఫొటో దీసుకోవడానికి మాకేం సిగ్గు లేదనుకున్నావా?''

మళ్ళీ ఏడిపించడం ఎందుకని నవ్వి వూరుకున్నాడు రవి.

దారిలో రవిని, రాజాను యింటికి తీసుకెళ్ళి టిఫిన్, కాఫీలు యిచ్చింది శ్యామల. రవి అత్తయ్యతో కబుర్లు చెబుతూ కూర్చోగానే రాజా, శ్యామలా చదరంగం మొదలుబెట్టారు.

"మీ యింట్లో రాజాఎంతో — మా యింట్లో శ్యామలా అంతే. అల్లరి చేయడంలో యిద్దరూ యిద్దరే. రోజూ పోట్లాడుకోవడమే. మళ్ళీ ఒకర్నొకరు వదిలి ఒకక్షణం వుండలేరు. వాడికైతే చిన్నతనం అనుకో. నేడో రేపో అత్తగారింటికి వెళ్ళాల్సిన పిల్లకు గూడ యింకా కుదురు అలవడలేదు.''

రాజా, అయిపోతున్న తన ఆటను జూస్తూ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. అప్పుడే గెలిచిపోయినంతగా వెలిగిపోతోంది శ్యామల ముఖం.

రాజాకు అమల దగ్గరకంటె శ్యామల దగ్గరే చనువెక్కువని గ్రహించాడు రవి. ఇదీ ఒకందుకు మేలేమో ననిపించింది ఒకక్షణం అతనికి. తనతో నిర్నిమిత్తంగా జరిగిపోతున్న ఆలోచనలకు ఫుల్‌స్టాపు పెడుతూ రవి లేచాడు.

కొన్ని నిముషాలు ఆటను చూసి రవి చేసిన చిన్న మార్పులతో శ్యామల రాజాకు ఎటూ కదలడానికి వీలు చిక్కలేదు.

"రోజూ నన్నేమో భలే ఓడించేదానివిగదా! ఈ రోజు అన్నేమో నిన్ను చిత్తుగా ఓడించేశాడు'' రాజా పరమానంద పడిపోయాడు.

''ఒకరే ఆడితే నేనే తప్పక గెలుస్తాను. మీరిద్దరు ఆడితే నేనొక్కదాన్ని ఓడిపోవడంలో ఏం గొప్పుంది మహా'' విసవిసా నడచి వెళ్ళి తల్లి వెనుకగా నిల్చుంది శ్యామల. అయితే ఓడిపోయినా శ్యామల నవ్వుతూనే మాట్లాడ్డం రవికి ఆనందం కల్గించింది. రాజా రవిచేసిన ట్రిక్కులను అవగతం చేసుకుంటూ చెస్ బోర్డు ముందే కూర్చున్నాడు.

''శ్రీధర్ ఎక్కడి కెళ్ళాడత్తయ్యా'' వీధిలోకి వస్తూ అడిగాడు రవి.

''ఎవరికి తెలుస్తుంది నాయనా! వాడేమైనా చెప్పిపోతాడా...'' అంటూ ప్రారంభించిన అత్తయ్య ఉపన్యాస ధోరణికి స్వస్తిపలుకుతూ సాయంకాలం మాట్లాడుదాం లెమ్మని వచ్చేశాడు రవి.

*   *   *

సాయంత్రం నాలుగు గంటలయింది. ఆదివారం కాబట్టి ఆ రోజు పోస్టురాదు. నిన్నటి పేపరు మరోసారి తిరగేసి కాఫీ త్రాగి ముగిస్తున్న రవిని ప్రశ్నించాడు రామనాథం.

''పరీక్షలెలా వ్రాసావురా ?''

''బాగానే వ్రాశాను. క్లాసు రావచ్చు. ఎం.ఏ ఎకనామిక్స్ తీసుకుందా మనుకుంటున్నాను'' అన్నాడు రవి.

''ఫలితాలు ఎప్పుడొస్తాయి?''

''ఈ నెల్లోనే రావాలి. ఎంఏ తర్వాత పిహెచ్.డీ చెయ్యాలనుకుంటున్నాను. ఇదొక నాలుగేళ్ళు, ఎంఏ రెండేళ్ళు – మొత్తం ఆరేళ్ళు...'' అంటూ ఆగాడు రవి, తండ్రి మాట్లాడడానికి ప్రయత్నించడంతో.

''ఇదుగో జానకీ. మంచినీళ్ళు దీసుకురా'' వంటింటివైపుకు తిరిగి కేకేశాడు రామనాథం.

తాను చెప్పదలుచుకున్నదేమో ఆమె గూడ వినాలని కాబోలు. రవి లోలోపలే నవ్వుకున్నాడు.

భార్య తెచ్చి ఇచ్చిన నీళ్ళు త్రాగి టేబిల్ క్రింద పడివున్న పాత పేపర్లన్నీ తిరగేసి–కొంతసేపటికొక పేపర్ బయటకు తీశాడు రామనాథం. జానకమ్మ గ్లాసుతో గుమ్మం దగ్గర నిలబడి వుంది. అమల మేటీ గుడ్డమీద రంగు నూళ్ళతో డిజైను కుడుతూంది. రాజా దొడ్లోనుంచి ఎవరితోనో మాటాడుతున్న అలికిడి.

రామనాథం పేపరును రెండుగా మడిచి సగం పేజీనిండిన అడ్వర్‌టయిజ్‌మెంట్ చూపాడు రవికి.

''శ్రీరామపురం షుగర్స్ లిమిటెడ్'' ప్రారంభోత్సవంనాడు పేపర్‌లో వేసిన ప్రకటన అది. ముందు పేజీ వార్తల్లో ఆ సందర్భంగా చక్కెర మిల్లుల మంత్రి చేసిన ప్రసంగం తాలూకు సంక్షిప్తపాఠం వుంది.

రవికి కొంచెంగా ఏదో అర్థమయింది. ఐనా మెలకువగా ''అవును నాన్నా. నాకు ఇంతకుముందే ఈ సంగతి తెలుసు. ఈ ఏడు మన తోట కూడ మిల్లుకే తోలితే మంచిదేమో. మామయ్య కెట్లా షేరు వుందని అంటున్నారుగదా'' అని అన్నాడు.

''రాజా ఈ ఏడు ఎనిమిది కొస్తాడుగదా. నిన్న వాడి మేష్టారు కన్పించాడు. కొంచెం అల్లరయినా బాగా చదువుతున్నాడని–సాయంకాలాల్లో యింటిదగ్గర చదివేట్టు చూడమనిచెప్పాడు.''

ఆయన ఆంతర్యం ఏమిటో–ఎందుకు తనకీ సంగతులు చెబుతున్నాడో రవి కర్థంకాలేదు.

''అవున్నాన్నా. రాజాకేం. బాగా చదువుతాడు. రెండేళ్ళలో ఎస్సెస్సీ పూర్తవుతుంది. రామాపురంలోనే కాలేజీ పడిందటగా. అక్కడే చేరుస్తేసరి.''

''ఆ సంగతే చెప్పొచ్చింది. ఈ అయిదేళ్ళూ నీ చదువు కింత వరకు దేవుడి దయవల్ల ఏ అప్పూ కాలేదు. కాని రేపు ఎట్లా వుంటుందో చెప్పలేం గదా. నెలకు నీకూ వాడికీ ఎంత తక్కువయినా నాలుగు వందలు తగ్గవు గదా'' రామనాథం ఆగాడు జానకమ్మ అందుకోవడంతో.

''అమలకీ ఈడొచ్చింది గదా. మొన్నెవరో డాక్టరట. చూసి వెళ్ళాడు. కట్నం మాత్రం ముప్పయికి తగ్గరట. అప్పటికీ మీనాన్నగారేమో మొగ్గు జూపారు. పిల్లవాడికి లేని తిరుగుళ్ళు లేవని తన కెవరో చెప్పినట్టు మీ మామయ్య చెప్పడంతో అది విరమించు కున్నాము.''

''నీవూ పెద్దవాడివయ్యావు. లోకంపోకడ తెలుస్తూందిగా. పైగా చదువుకొన్నావు గూడ. నీకు తెలియందేముంది. రోజుకు రోజుకు పెరిగిపోతున్న ఎరువుల ధరలు–పంట పండకపోయినా పన్ను తప్పదు గదా. తాసీల్దారు దగ్గరయినా పని జేయించుకోవచ్చుగానీ– ఈ కూలీల దగ్గర పని జేయించుకోవడం కష్టమవుతూ వుంది. స్వంత మనిషి ఉంటేగాని పని జరగదు'' కొంచెం ఆగి మళ్ళీ అందుకున్నాడు రామనాథం.

''మీ మామయ్యకు చక్కెర మిల్లు మేనేజరు బాగా తెలిసినవాడట. మొన్న నీ సంగతి ప్రస్తావిస్తే వుద్యోగం ఏదయినా ఖాళీ పడితే మన తర్వాతగాని మరొకరికి పోనియ్యనన్నాడట'' చెప్పవలసిన సంగతి ముగిసిందన్నట్టుగా లేచి తుండు గుడ్డొకటి భుజంమీద వేసుకుని దొడ్లోకెళ్ళాడు రామనాథం.

రవి ఖిన్నుడై తలవంచుకు కూర్చున్నాడు. ''నీకు మిల్లులో వుద్యోగం అయితే ఇంటిపట్టునే వుండి ఎంచక్కా పొలం పనీ చూసుకోవచ్చు. మీ నాయనకీ చేదోడుగా వుంటుంది. రాజా కూడా నువ్వంటేనే కొంచెం భయపడతాడు గదా'' సర్ది చెప్ప జూచింది జానకమ్మ.

ఐదేళ్ళుగా తాను కష్టపడి చదివింది – బి. ఏలో క్లాసు తెచ్చుకుంటున్నది అంతా వ్యర్థం అయిపోయినట్టు తోచగానే రవికి ఎక్కడలేని నీరసం ముంచు కొచ్చింది. ఇన్నాళ్ళు తల్లిదండ్రులు తనను చదివించడంలోగల రహస్యం వారి స్వార్థమే తప్ప అన్యం కాదనిపించింది. తమ్ముడు రాజా కానీ, మామయ్య కొడుకు శ్రీధరం గానీ తల్లిదండ్రులమాట వినకుండా తమవ్యక్తిత్వం నిలుపుకున్నారని పించింది.

విసురుగా వెళ్ళి చెప్పులేసుకుని చెరువు కట్టమీద కొచ్చేశాడు రవి. తనకు మేలు చేస్తున్నట్టు నటిస్తూ కేవలం తన నొక డబ్బు సంపాదించే యంత్రంగా చేసుకున్నారనీ—ఈ గూడు పుఠాణిని బట్ట బయలు చేసేటట్టుగా వీరికి తగిన శాస్తి చెయ్యాలనీ, అతని కన్పించింది.

రాత్రి ఏడయినా యింటి కెళ్ళాలనిపించలేదు రవికి. ఈదర గాలిలో పిచ్చి పట్టినట్టుగా తిరగడంచేత, విపరీతమయిన ఆలోచనా భారంచేత ఆ సాయంత్రం ఇంటికిచేరేసరికి రవికి ఒళ్ళంతానొప్పులు. కళ్ళంతా మంటలు, విపరీతమయిన తల నొప్పి ప్రాప్తించాయి, ఎవరేం మాట్లాడినా బదులుగా కరిచేద్దామన్నంత చీకాకు కల్గింది.

ఇంటికి వచ్చేసరికి తండ్రి పనిమీద మళ్ళీ పక్కవూరికి వెళ్ళి నట్టు తెలిసింది. అన్నను పలుకరించడానికి అమలగాని, రాజాగాని సాహసించ లేకపోయారు. కొడుకుకు దిష్టి తగిలిందనే వుద్దేశంతో, దిష్టి తీయించడానికి మంచంమీద అడ్డంగా పడివున్న రవిని లేప డంలో జానకమ్మ విఫలురాలైంది. కొద్దిగా వొళ్ళు వెచ్చబడి నట్టుంది గూడ, తలమీద చేయివేసి చూడడంతోనే జానకమ్మకు తెలిసిపోయింది. రాత్రికి ఒక మాత్రను మింగించి గుక్కెడుపాలు త్రాగించడానికే ఆమెకు గగనం అయిపోయింది.

మరునాటి ఉదయం పది గంటలయినా రవికి లేవబుద్ధి కాలేదు. తాను మూడు సంవత్సరాలుగాకన్న కలలన్నీ కల్లలయిపోయి నట్టు తలుచుకున్నకొద్దీ అతనికి ఉక్రోషం ముంచుకు వస్తోంది. తల్లినిగాని, చెల్లిని గాని ఎవర్నీ పలుకరించ బుద్ధి కాలేదు. జ్వరం తగ్గినా, లేచిముఖమయినా కడుక్కోని కొడుకు వాలకం జానకమ్మకు కొంచెం కొంచెంగా అర్థమయింది.

ఆ ఉదయం మామూలుగా రవి తోటకేసి వస్తాడని ఎదురు చూచిన శ్యామల – రాజాద్వారా రవికి జ్వరం వచ్చిన సంగతి తెలుసు కోవడంతో, చేతిలో అంతవరకు కోసుకున్న కనకాంబరాల సజ్జతో సహా నేరుగా అత్తవారింటికే వచ్చేసింది.

ఆసరికే సగం వంట పూర్తయ్యే యింట్లో, అప్పటి కింకా పొయ్యి ముట్టించే ప్రయత్నమే జరిగినట్టు లేదు. అమల తల్లితో "అన్నను చదివించనని ఎందుకన్నారమ్మా? అప్పుడే ఏం మునిగిందని అన్న ఉద్యోగం చేయాల్సి వచ్చింది?"అంటూ గుణుస్తోంది. రాజాకు చదువు వద్దనటంవల్ల సంతోషమేగానీ, బాధ ఎందుకో ఎంత ఆలో చించినా అర్థం కాలేదు.

వాడు తిన్నగా అన్న దగ్గరికెళ్ళి రెండుసార్లు మెల్లిగా పిలి చాడు. రవి కొద్దిగా కళ్ళు తెరిచి విసుగ్గా 'ఏం' అన్నట్టు చూసాడు "నేం చదువుకు నిల్చిపోతాలే అన్నా! నువ్వెళ్ళి చదువుకుందూగాని" అంటూ రాజా అన్నను సముదాయించబోయాడు.

అంత కోపంలోను రవి పక్కున నవ్వుతూ, అంతలోనె వ్రత భంగమయినట్టుగా మూతిముడుచుకుని చదువు ఎగ్గొట్టి ఊరంతా తిరుగుతూ అల్లరిచేయడం తప్పించి వీనికేం అర్థం కాదనుకుంటూ "అతిగా వాగక అవతలికెళ్ళు. వేలెడులేవు. అన్నీ నీకే కావాలి. మళ్ళీ యిలా వాగావంటే దెబ్బలు తింటావ్" అని కసిరాడు.

చిన్నబుచ్చుకుని, బడితె చూపించగానే తోక ముడుచుకుని 'మియ్యావ్' అంటూ వెళ్ళిపోయే పిల్లి పిల్లలా నిష్క్రమించాడు రాజా. ఆ తరువాత పది నిముషాల్లోనూ గోడ గడియారం టంగు టంగుమని పది గంటలు కొట్టడం మినహాగా శ్యామలకు ఇంకే చలనం కన్పించలేదు.

అమలను, రాజాను పలుకరించి బదులు లేకపోవడంతో శ్యామల తిన్నగావెళ్ళి అప్పుడే పొయ్యి రాజేసి పాలు కాచుతున్న అత్త ప్రక్కగా వెళ్ళి నిలుచుంది.

"ఏమిటత్తయ్యా. ఇంత ప్రశాంతంగా ఇల్లుండడం నాకు ససేమిరా యిష్టం లేదు. ఏం జరిగింది. బావనేమయినా అన్నారా మీరు" తగ్గు స్వరంలో అడిగింది శ్యామల.

"ఏమిటో తల్లీ. మాకేంతెలుస్తుంది. అలిగిపడుకున్నాడుగా వెళ్ళి మీ బావనే అడుగు ఏం అన్నామో" విసురుగా పెరట్లోకి నడిచిపోయింది జానకమ్మ.

శ్యామల మెల్లగా రవి గదిలోకి నడిచింది. ఎవరి ముఖం చూడడం యిష్టం లేనట్టుగా బోర్లాపడుకుని వున్నాడు రవి. పలు కరించడానికే శ్యామలకు భయంవేసింది. జ్వరం కాస్తూనేవుందేమో నన్న అనుమానం రావడంతో మెల్లగా వెళ్ళి వీపుపై చేయివేసింది శ్యామల.

"మళ్ళీ ఎందుకొచ్చావ్" రవి గయ్ మంటూ లేచాడు.

"ఇదే మొటిసారి రావడం" భయపడుతూనే అంది శ్యామల.

"ఉద్ధరించావులే. వెళ్ళవతలకి" ముఖం మీదకు ముసుగు లాక్కున్నాడు రవి.

గదిలో శ్యామల ఉండడంతో రాజాకు కొంచెం ధైర్యం చిక్కింది. గది బయటే నిలబడి తల మాత్రం లోపల బెట్టుతూ "నాన్న చదువు మానెయ్యమన్నాడని అన్న అలిగాడట" అన్నాడు. ఇంతలో ముఖం పై నుంచి ముసుగు తీసేసి రవి తనను మింగేసే టట్టు చూడడంతోనే, అదేమీ తన తప్పు కాదన్నట్టుగా "అం, అమ్మ చెప్పింది" అని మళ్ళీ గోడ చాటుగా నిల్చున్నాడు.

"మా నాన్నతో చెప్పి మామయ్యతో నిన్ను చదివించమని చెబుతాలే బావా. ఇంత చిన్నదానికే అలగడం ఎందుకు" ఏడుస్తున్న

చంటిపిల్లడిని సముదాయిస్తున్నట్టుగా శ్యామల మాట్లాడ్డం రవికి నవ్వు తెప్పించినా, యింటా బయిటా అందరూ తనకే బుద్ధి చెబుతూండడంతో చిరాకు వేసి –

''అసలు నాచదువు సంగతి మీకెందుకు. చిన్న విషయానికే ఎందుకు రాద్ధాంతం చేస్తారు. ఇంతకూ నేను అలిగానని ఎవరు జెప్పారు మీకు'' అంటూ టూత్ బ్రష్‌పై పేస్ట్ వేసుకుని బావి దగ్గరకు నడిచాడు.

''మొత్తంమీద సాధించావు'' అని అమల శ్యామలను మెచ్చుకుంది. ఇందులో తను జేసిందేమిటో శ్యామల కర్థం కాకపోయినా రవి అలుక మానినందుకు సంతోషించింది.

మధ్యాహ్నం ముభావంగానైనా రవి చారన్నం తిన్నందుకు జానకమ్మ సంతోషించింది. సాయంత్రం మళ్ళీ శ్యామల వచ్చేవరకూ రవి ఎవ్వరితోనూ ఎక్కువగా మాట్లాడలేదు.

నాలుగున్నరకు మళ్ళీ వచ్చిన శ్యామలతో అమల అంది ''మొత్తంమీద పెళ్ళిగాకముందే మా అన్నను వల్లో వేసుకున్నావు. మధ్యాహ్నం నుంచీ 'నువ్వువచ్చావా' అని రెండుమూడుసార్లడిగాడు.''

రవి తనపై శ్రద్ధచూపడం ఒకందుకు శ్యామలకు ఆనందం కల్గించినా – అంతలోనే ఆశ్చర్యమూ కల్గించింది.

డాబాపై పచార్లు చేస్తున్న రవితో శ్యామల అడిగింది. ''ఎందుకు బావా, ఈరోజు నన్ను రెండుసార్లు అడిగావట!''

రవి పచార్లు ముగించి, పిట్టగోడపై కూర్చుంటూ చెప్పాడు. ''మరేంలేదు, నువ్వే అన్నావుగా! మామయ్యను నా చదువు సంగతి నాన్నతో మాట్లాడమంటానని. నిజానికి మా నాన్నకు మామయ్య మాటంటేనే కొంచెం గురి. ఎలాగైనా ఎం ఏ అయినా పూర్తయ్యేటట్టు చూడమని మీ నాన్నతో చెప్పు'' అంటూ ముగించాడు రవి.

'ఓహో, యిది చదువుమీద శ్రద్ధ కాబోలు. యింకా తన మీదే అనుకుంది కాదు నయం' శ్యామల కొంచెం నిరాశపడింది.

''అదేం భాగ్యంలే. నీ అంత తెలివైనవాడు కాకపోతే ఇంకెవరు ఎం ఏ చదవగలరు'' అంది శ్యామల.

మబ్బులు ముసురుకోవడంతో యింటి కెళ్ళాలని లేచింది శ్యామల. ఇంతలో తోటలో నుంచీ మళ్ళీ కోయిల కూత విన రావడంతో నవ్వుతూ రవికేసి చూస్తూ అంది.

''కోయిల కన్పించిందా భలే తెల్లగా వుంది గదూ.''

''మరే. నీ అంత తెల్లగా వుంది'' నవ్వుతూ అన్నాడు రవి.

* * *

మరునాడు సాయంత్రం రవి వీధిలోకి వస్తూనే శారదతో మాటాడుతున్న చంద్రబాబు, రమేష్, శ్రీధర్ కన్పించారు. చంద్రబాబు తాను మద్రాసులో వున్నప్పుడు తమ రెండో ఇంట్లో వుండిన ఆంగ్లోయిండియన్ స్త్రీలు కడుపుతో వున్నప్పుడు పడే అవస్థల్ని, తీసుకునే జాగ్రత్తల్ని చిత్ర విచిత్రంగా చెబుతుంటే, ఆ మాటలకు శారద పడి పడీ నవ్వుతూంది. అంతకుముందు అతన్ని గురించి ఎక్కువగా ఆలోచించి వుండడంచేత, స్నేహితుల ద్వారా అతన్ని గురించి వినివుండడంచేత రవికి యితడే 'చంద్రబాబు' అని తెలుసుకోవడంలో అట్టే శ్రమ కలుగలేదు. విపరీతంగా మాసిపోవడం మినహా అతని బట్టలన్నీ ఆధునికంగానే వున్నాయి.

శ్రీధర్ రవిని పరిచయం చేయడంతోనే చంద్రబాబు చేయి ముందుకు సాచి ''గ్లాడ్ టు మీట్ యూ'' అంటూ అతని చేతిని రెండుసార్లు ఊపి వదిలాడు.

రమేష్‌తో రవిని సాయంత్రం భోజనానికి తీసుకురమ్మనిచెప్పి శారద యింట్లోకి వెళ్ళిపోయింది.

మిత్రులందరూ స్టేషన్‌వైపు నడిచారు. మద్రాస్‌లో తాము కాలేజీలో కొత్తవారితో స్నేహం చేసేటప్పుడు విధిగా టీ తీసుకునేవారిమని చెబుతూ చంద్రబాబు ఊరిలో మస్తాన్ టీ హోటల్లోకి దూరబోయాడు.

కుంపటిమీద యిప్పుడే పచ్చిపాలు పెట్టానని, కాగడానికింకా ఒక పావుగంట పడుతుందని మస్తాన్ సెలవియ్యడంతో, చంద్రబాబుకు ప్రక్కనేవున్న వెంగళ్రాయులి టీ హోటల్లోకి నడవక తప్పింది కాదు.

చంద్రబాబును చూడడంతోనే వెంగళ్రాయులి ముఖం జేవురించింది. నోట్లోని బీడీని ఆర్పి చెవులపై పెట్టుకుంటూ ఏదో అనడానికి ఉపక్రమించినవాడు వెనుకనేవస్తున్న రవిని చూడడంతోనే బలవంతాన ముఖం ప్రసన్నం చేసుకున్నాడు.

చంద్రబాబు ఇదేమీ గమనించనట్టు ''నాలుగు కాఫీ లియ్యవోయ్'' అంటూ పాకలో ఒక మూలగా వుంచిన చిమ్నీ దీపం దగ్గరికెళ్ళి సిగరెట్టు ముట్టించుకున్నాడు.

కాఫీలు త్రాగిన తర్వాత మరో సిగరెట్టు ముట్టించుకుంటూ అన్నాడు చంద్రబాబు ''అసలు ఊపిరి పీల్చకుండా అయినా నేనొక గంట ఉండగలను కానీండి – అదేం ఖర్మో ఈ సిగరెట్టు పొగ పీల్చకుండా పది నిమిషాలు ఉండలేనంటే నమ్మండి ... ... ఒకసారి ఏం జరిగిందో తెలుసా? ఎట్లా తెలిసిందో ఏమో, డైలీ నేను నైట్ మీల్స్ తర్వాత విధిగా డాబా పైకెళ్ళి సిగరెట్టు కాలుస్తున్నానని మా ఫాదర్‌కు డౌట్‌వచ్చింది. ఒకరోజు నేను నోటిలో సిగరెట్టు వుంచుకునే సరికి అతను గూడా డాబాపై కొచ్చేశాడు. అప్పుడు నేనేం జేసాననుకుంటున్నారు?''

సిగరెట్టు చివర ఏర్పడిన నుసిని రాల్చి మళ్ళీ నోట్లో పెట్టుకుని గట్టిగా పీలుస్తూ ఆగాడు చంద్రబాబు. రమేష్, శ్రీధర్ ''ఏం చేశావు ఏం చేశావ''ంటూ పరమాసక్తులయిపోయారు.

నవ్వడం మాటాడ్డం ఏకకాలంలోజేస్తూ ''క్వైట్‌సింపుల్. 'మాచ్‌బాక్స్ ఉందా' అని అడి ను''అన్నాడు చంద్రబాబు చంద్ర బాబు తెలివికి, తెగువకు, సమయస్ఫూర్తికి మిత్రద్వయం తెగ సంబరపడిపోయారు.

ఇదంతా వింటున్న చెంగల్రాయులు ఒకక్షణం తర్వాత నవ్వి మొదలుబెట్టాడు.

''ఓయబ్బో! దీన్నొక పెద్ద కథగా సెప్తావుండావు. అయితే యిది యిప్పటి సంగతి కాదులే. మాయమ్మ కడగొట్టోన్ని గని మంచం దిగకుండా వున్నప్పుడు, మేమంతా నెల్లాళ్ళు దినం మార్చి దినం గెంజి దాగి కాలం గడుపుకుంటిమే – అప్పుడు సంగతి. చేసే గాజుల యాపారం మానేసి మా నాయిన ఎవితో ఒక పరాయిదాని మాయలో పడిపోయె. మాయమ్మ బాలింతరాలా. వారానికి నాలుగు మాట్లు సలీ జొరంకొట్టి ఆసమ్మత్సరం పెద్ద పండుగకు ముందు నాడు ముందునాడే ఆమే కడతేరిపోయె. మమ్మల్ని కన్నోడు కడాన ఆమె సావుకొచ్చాడా రాలా. ఊర్లో వాడెవడూ మా మొగం సూడ్లా. నాకేం దిక్కు తోచకబోతే – పోయి పోయి మన రవిబాబు వాళ్ళ నాయిన కాళ్ళబడినా. ఆ పెద్దమనిసి మేమున్న కొంపను గోవింద సెట్టికాడ అడమానం పెట్టించి ఇన్నూరు రూపాయలు యిప్పించి నాడు. దాంతో మళ్ళా మా నాయిన దించేసిన మలారం బుజాని కెత్తుకోని దేశంమీద బడితి. ఒకింట్లో మహాతల్లికి గాజులేస్తావుంటే పడకింట్లో నుంచి మానాయి నూడిపడె ఒక చనం నా వొళ్ళు మానయిపోయిందనుకో.''

శ్రోతల్లో రియాక్షన్ చూడడం కోసం ఆగాడు చెంగల్రాయులు.

''ఏం జేస్తివప్పుడు?'' కరటక దమనకుల్లా శ్రీధరూ రమేషూ ఎగబడ్డారు.

''ఏసిన గాజుల కామెకాడ ఒకనయాపైస దీసుకోలే. మలారమెత్తుకోని గడపదాటి పోయేతలికి ఆయమ్మ అడ్డమొచ్చి 'అదేందిరా అబ్బీ. చేతికి గాజులేసి దుడ్డు మర్సిపోతా వుండావు. ఈ రకంగా బేరంజేస్తె నువ్వేం బతికి బట్టకడతావు' అని రూపాయి నోటు సేతిలో పెట్టింది.''

''తీసుకుంటివా'' ''ఆఁ మళ్ళేమయింది'' అంటూ కళ్ళు మిటకరిస్తూ ప్రశ్నించారు మిత్రద్వయం.

జోబీలో వుండే చిల్లరా, నోట్లు అంతా జవిరి ఆమె చేతిలో బోస్తూ కడమాటగా యిట్ట జెప్పి చక్కా వచ్చేసినా.

''వద్దులేతల్లీ ఇదంతాకూడా నువ్వుపెట్టుకోని నూరేండ్లు రాజ్జమేలు. మా నాయినెప్పుడైనా ఇంటికెలబారితే చార్జికిమాత్రం నాలుగు రూపాయి లియ్యి.''

రవి కళ్ళలో తిరిగిన నీళ్ళను కర్చీఫ్‌తో తుడుచుకుంటున్నాడు. భరించలేనట్టుగా చంద్రబాబు ఎప్పుడో రోడ్లో వున్నాడు. మిత్ర ద్వయం ముఖాల్లో కత్తివేటుకు నెత్తురుచుక్క లేదు.

మళ్ళీ నిశ్శబ్దానికి భంగంకల్గిస్తూ అన్నాడు చెంగల్రాయులు.

''ఆ తర్వాత ఒక వారం తిరక్కముందే మా నాయన ఇంటి కగ్గిబడె. నేనీ కథ మా యింట్లో ఎవరికీ సెప్పలా. అదెవితోతెచ్చేసి నన్నాళ్ళు యింట్లో బెట్టుకోని, మూలబడిన్నాడు మెట్టుతో గొట్టి తరిమేసిందని ఊళ్ళో రచ్చకాడ చెప్పుకుంటూ వుంటే వినబడితి.''

రవికేసి తిరిగి కథ ముగించేస్తున్నట్టుగా ఒకమాట జెప్పాడు చెంగల్రాయులు.

''అయితే ఒకటయ్యా! ఆయమ్మ ఎవురైతే ఏమిగాని నేనే పొద్దు ఆ వూరికి పోయినా వాళ్ళింట్లో అన్నం తినందిగాక వదిలి బెట్టదు. వచ్చేటప్పుడు బిడ్డల కిమ్మని రిబ్బన్లు కొన్పించి, గౌన్ల దాక ఏందేందో ఇచ్చిపంపుతాది. మొన్న కడసారి ఆడికిపోయినప్పుడు కండ్లల్లో మెదలతావుండాడని మా నాయన్ను కూడ ఒకసారి వచ్చి పొమ్మనె.''

రవికి తాను, చెంగల్రాయులు, శ్రీధరూ – అందరూ కలసి అయిదో తరగతి చదివేటప్పుడు ఉండిన తెలుగు ఉపవాచకంలోని 'ధర్మవ్యాధుడు' పాఠం గుర్తుకు వచ్చింది. నిజానికి ఆ కథ చెంగల్రాయులు ఎప్పుడో మర్చిపోయి వుంటాడు. అయితే తాను గుర్తు వుంచుకుని మాత్రం ఏ విధంగానైనా చెంగల్రాయు లంత ఉన్నత హృదయుడు కాగలిగాడా? నిన్నకు నిన్న చదువు మానమనగానే తలి దండ్రులను గురించి తాను ఆలోచించిన సరళి గుర్తుకు రాగానే రవి తీవ్ర పశ్చాత్తాపానికి గురైపోయాడు.

అయితే పుస్తకంలో తాము చదివిన ధర్మవ్యాధుని కథ గాని, నిజజీవితంలోని చెంగల్రాయుల ఐతిహ్యంగాని రమేష్‌ను, శ్రీధర్‌ను మార్చినట్టు లేవు. కరటక దమనకు లిద్దరూ బిల్లు చంద్ర బాబి స్తాడా, రవి యిస్తాడా అని యిద్దరికేసి మార్చి మార్చి జూస్తున్నారు. చెంగల్రాయుల చూపు మాత్రం చంద్రబాబు పైన్నే వుంది.

రవి జేబులో చెయ్యిపెట్టగానే–సగంకాలని సిగరెట్టును కాలి కింద నలిపేస్తూ చంద్రబాబు పరుగెత్తు కొచ్చేశాడు. ''అబ్బెబ్బే ఇదేవిటి మీరిస్తారా. మంచివారే. ఉండండుండండి'' అని ఐదు రూపాయల నోటుదీసి చెంగల్రాయుల చేతిలో వుంచాడు.

తడిచేతిని తొడలమీద రుద్దుకుంటూ చెంగల్రాయులు ఒక క్షణం జాప్యం జేయడంతో ''చిల్లర లేదుటోయ్. ఉంచుకో. మళ్ళీ యిద్దువుగాని'' అంటూ జవాబు కోసం ఎదురు చూడకుండా వీధి లోకి వచ్చేశాడు చంద్రబాబు.

ఆరోజు సాయంత్రం ఏడుగంటలదాకా అందరూ మాట్లాడ కుంటూ ఊరంతా తిరిగారు.

సంభాషణ ముగిసే సమయానికి రవికి చంద్రబాబుపై వున్న సదభిప్రాయం కాస్తా పోయింది. చంద్రబాబు సైతం రవిని యి మీదట వీలయినంత దూరంగనే వుంచాలని అనుకున్నట్టు మరుస రోజు అతడు తనను గురించి శ్రీధర్‌తో చెప్పిన మాటలను బట్టి అవగతమయింది.

ముఖ్యంగా 'మద్రాసు స్టేట్‌లో ఇంటర్ మీడియట్ లేదన టము', సమర్‌గుహ అన్నది ఒక మనిషి పేరేనని, గుహపేరు కాదని చెప్పడమూ లాంటి పనులు స్వదేశ రక్షణకు భంగం కల్గించే రహస్యాలను శత్రుదేశాల్లో బయట పెట్టినంత నేరంగా చంద్రబాబు భావించినట్లు రవి గ్రహించాడు.

''లిక్కర్‌గాని, సిగరెట్‌గాని ఆఫర్ చేసినప్పుడు వద్దనటం లాంటి ఇల్లిట్రేట్స్ చేయాల్సిన పనిని రవి లాంటి ఎడ్యుకేటెడ్‌ఫెలో చేయడం తానే మాత్రం సహించలేడనీ, ఆ మాత్రం మేనర్స్‌లేని వాళ్ళతో తానొక క్షణమైనా ఫ్రెండ్‌షిప్ చేయలేననీ తనతో సీక్రెట్‌గా చెప్పినట్లు'' శ్రీధర్ రవితో చెప్పడంతో అతనిలో ఈ అనుమానం కాస్తా బలపడింది.

అయితే చంద్రబాబు ప్రభావం నుండీ మిత్రులను తప్పించడానికి రవి చేసిన ప్రయత్నాలు దాదాపు వ్యర్థం అయ్యాయి. తాను చెప్పినదానికంతా సరేననడమూ, మళ్ళీ యథాప్రకారం అతనితో తిరగడమూ జూచి, తన అశక్తతను గుర్తించి మళ్ళీ ఆ ప్రయత్నం చేయదలచుకోలేదు రవి. పోగా రవిని వేధిస్తున్న సమస్య ఇంకొకటి గూడవుంది ఇతనితో స్టేషనుమాష్టరూ, ఆయన కుటుంబమూ ఎలా వేగుతున్నారా అని. తాను ఊరికి వచ్చిన రోజు నుంచీ మళ్ళీ యింతవరకు స్టేషన్‌వైపు వెళ్ళి రాకపోవడం గుర్తువచ్చింది. అంతేగాక తన చదువు విషయంలో తనకయినా, తండ్రికయినా సలహానివ్వగలవాడు శ్రీరాములేనన్న తలంపు రావడంతో వీలయినంత త్వరగా స్టేషనుకు వెళ్ళి రావాలనుకున్నాడు రవి.

(ఇంకా వుంది)

కవులు - బహువచనమ్

శ్రీ దేశపతి గోపాలకృష్ణ

కవి తన ఇష్టం వచ్చినట్లు
తత్వ వివేచనం చేయటం
ప్రకృతిని నిజకవితలో
ప్రతిబింబింప చేయడం
ఒక సరదా
పాపాలపై వేయడెప్పుడూ
అతడు నీచమైన పరదా.

* * *

బాధపడే దీనజనతనుచూచి
అన్నార్తులనూ - అర్ధనగ్నులనూ
కౌగిలించి — వాళ్లగోడు
కరుణరసంగా సృష్టించి
గుండుల్లో వరుణుని కృపా
వర్షంలా — ఆంధ్రభూ
మా వక్షోజాల్లోనుండి
పారే క్షీరధారల్లా
ప్రకృతి దేవీకటాక్షంతో

పారుతున్న గోదావరీ
కృష్ణల్లాగా — పరోపకార
సుమతి బీజాలునాటి
భువిని నందనం చేస్తాడు
కవి — మహా మనీషి.

* * *

సుకవితగల కవిరాట్టుకు
సాహితీ మధురిమ పంచే
రసరాజ్యం కావాలి —
శుష్కమైన ఎలక్షన్ భిక్షాపాత్ర - కవి
మస్తిష్కంలో ఆడదు
ప్రజాస్వామికంలో రుజాస్వామ్యం
పోవాలి! అదీ అతని దీక్ష!

* * *

అతడు దండపాణి — కోదండపాణి
అనంత ప్రళయకాల రౌద్ర నాట్యంచేసే
శూలపాణి — అన్యాయైక జీవికో

పాత్ర స్వార్థశక్తుల బాహిరభక్తికీ
అంతరంగంలో కేవలభుక్తి
మాత్ర దురుద్దేశాల ప్రాణులకూ.

కవి చేతిలో దేశద్రోహులు
గరుత్మంతుని నోటి పాములు
నరసింహం కొరికి పారవేసిన
హిరణ్యకశిపులు!
వీరభద్రుడు కోసిన శీర్షహీన
పశ్చాత్తప్త దక్షప్రజాపతులు!

మొదటి వాల్మీకి ఒకడే కవి
(ఏకవచనం)
అతడూ వ్యాసుడూ కలిసి లెక్కిస్తే
(ద్వివచనం)
తరువాత ఈనాడు
కరువుతీరా — వ్రాసికొంటున్న
కవి బ్రువులు అనేకులు.
(బహువచనం)